# మోక్షానికి అడ్డు ఎక్కడుంది?



*యేష్వంగనానాం ప్రవదంతి దోషాన్*
*వైరాగ్య మార్గేణ గుణాన్విహాయ*
*తే దుర్జనా మే మనసా వితర్కః*
*సద్భావ వాక్యాని నతాని తేషాం*

***భావం:*** వైరాగ్య మార్గంలో పయనిస్తూ స్త్రీల గుణాలను వదిలివేసి వారి దోషాలను మాత్రమే ఉద్ఘాటించేవారు దుర్జనులని నా నమ్మకం. అటువంటి వారి మాటలు సద్భావనతో కూడినవి కావు.

శ్రీకృష్ణుడు భగవద్గీతలో మానవునికి కామక్రోధాలు శత్రువులని నిర్ద్వంద్వంగా చెప్పాడు. చారిత్రిక సామాజిక ఆర్థిక కారణాలు ఏమైనా కావచ్చు.

కానీ కామం అన్న మాటను తీసివేసి కామిని అన్న మాటను వేసి స్త్రీయే మోక్ష మార్గంలో వెళ్ళే వారికి శత్రువనీ ఆమె అందం అడ్డుగా నిలుస్తుందనీ స్త్రీకి దూరంగా ఉండాలనీ గురువులు హెచ్చరించడం ప్రారంభించారు. ఆ విషయమై కవితలు కూడా అల్లారు.

ఆ బోధనలతో ముగ్ధుడైన ఒక భర్త మహాశయుడు సన్యసించి అడవుల్లోకి వెళ్ళి పోవాలని నిర్ణయించుకున్నాడు. ఆ విషయం తెలిసిన భార్య గృహస్థ ధర్మంలో ఉంటూనే భక్తి మార్గంలో భగవంతుని చేరుకోవచ్చని చెప్పింది. భర్త గారు "సన్యాసమొక్కటే మార్గం గృహస్థ ధర్మంలో ఉంటే స్త్రీలవల్ల కోరిక ప్రజ్వలిస్తుంది. ఇంక భగవదారాధన ఏముంది" అన్నాడు.

భార్య 'అయితే సరే. మీరు సన్యసించాక నాకు మాత్రం ఇంట్లో ఏముంది? నేనూ అడవిలో తపస్సు చేసుకుంటాను" అంది.

"నువ్వు కూడా ఉంటే ఇంక సన్యాసమేమిటి" అన్నాడు భర్త

"నేను మీకు దగ్గర ఉండను. నా దారిన నేను జపం చేసుకుంటాను" అందామె.

"సన్యాసమంటే తపస్సంటే ఏమిటనుకుంటున్నావు? కోరికలు జయించాలి. అసలే ఆడవాళ్ళకి నగల పిచ్చి. బంగారాన్నీ మట్టినీ ఒకేలా చూడాలి." అన్నాడు.

భార్య అన్నిటిపై వ్యామోహాన్ని వదిలేస్తానంది.

ఇద్దరూ అడవికి బయల్దేరారు. భార్య పక్కన నడవడం కూడా అతనికి ఇష్టం లేదు. స్త్రీ మోక్షమార్గానికి అడ్డు అనీ ఆమెను దూరంగా ఉంచాలనీ అతడు ముందు నడుస్తున్నాడు. ఆమె వెనకగా ధ్యానం చేసుకుంటూ నడుస్తోంది.

కొంత సేపయ్యాక అతనికి ఒక బంగారు నగ కన్పించింది. ఆ మార్గంలో వెళ్ళిన వారెవరిదో జారిపోయి ఉండవచ్చు. ఈ నగ భార్యను తప్పక ఆకర్షిస్తుందనుకుని అతడు ఆగిపోయి గొయ్యి తవ్వి నగను గోతిలో పాతిపెట్టాడు. మట్టితో గొయ్యి పూడుస్తుండగా భార్య అక్కడకు చేరుకుని " ఏం చేస్తున్నారు" అంది.

భర్త విషయం చెప్పాడు. ఆమె "బంగారాన్నీ మట్టినీ సమంగా చూడాలని నాకు చెప్పారు. బంగారం చూడగానే మీకు తేడా కన్పించిందే" అంది.

స్త్రీని మోక్షమార్గానికి అడ్డుగా భావించి కామిని శత్రువనడం ప్రాచీన సన్యాసుల్లో పరిపాటి. నిజమైన శత్రువు రజోగుణం నుంచి పుట్టిన కామం మాత్రమే. ఆ విషయాన్ని గుర్తించక స్త్రీ లోని లోపాలను ఎన్నుతారు. అసలు మోక్షానికిఏవీ అడ్డు కావు కాలేవు. కేవలం కామం లేదా కోరికనే మోక్షానికి అడ్డుగా నిలుస్తుంది.

******